క్లుప్తంగా

నలందలో మ్యాథ్స్ ఎగ్జిబిషన్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో గురువారం మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన కఠినమైన సమస్యలను సులువుగా పరిష్కరిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. గణితశాస్త్ర సిద్ధాంతాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం లక్కారం ప్రసాద్, లక్కారం సాగర్, ఉపాధ్యాయులు హన్మాండ్లు, ప్రవీణ్, అక్షయ్, దివ్య భారతి, కీర్తి, అరుంధతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



రుద్రూర్ : స్వచ్ఛంద సంస్థ 'హోప్ ఫర్ లైఫ్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పేద వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి 15 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ కొత్తపల్లి రమేశ్, లింగం, సాయిలు పాల్గొన్నారు.

టై, బెల్టుల వితరణ



వేల్పూర్: మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన ఆడెపు గజానంద్ స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8 వేల విలువైన టై, బెల్టులను గురువారం అందజేశారు. కుకునూర్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం నారాయణ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్ దాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సురేశ్, సర్పంచ్ విజయలింబాద్రి, హెచ్‌ఎం హరిచరణ్, వీడీసీ చైర్మన్ ర్యాడ రాజన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ చిన్నోళ్ల రాజన్న, రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



రెంజల్(బోధన్): పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యే క శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ బోధన్ సెక్టార్ సీడీపీవో జానకి అన్నారు. రెంజల్ మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం చిన్నారు లు, గర్భిణులు, బాలింతలకు భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. న్యూట్రీగార్డెన్‌ల ద్వారా ఆకుకూరలను సాగు చేయాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలింతలు, గర్భిణులకు సూచనలు చేశారు. ఆమెవెంట సూపర్‌వైజర్ ప్రమీలారాణి ఉన్నారు.

వాహనాల అద్దాలు ధ్వంసం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెద్దబజార్, చిన్నాబజార్‌లోని ఇళ్ల సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. చిన్నాబజార్‌లో ఓ కారు, పెద్దబజార్‌లో ఆటో, కారు అద్దాలను బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై గంగాధర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ



బోధన్‌టౌన్(బోధన్): ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. బోధన్ మున్సిపాలిటీలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్) నర్సింహారెడ్డి గురువారం పరిశీలించారు. తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌కు పలు సూచనలు చేశారు.

పొంచి ఉన్న ముప్పు

- బీటీ రోడ్డు పక్కన భారీ గుంత
- భయం భయంగా రాకపోకలు



బీటీ రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న గుంత



ప్రమాద సూచికగా రోడ్డు పక్కన కట్టిన రేడియం రిబ్బన్లు

మాక్లూర్: మండలంలోని బోర్గాం (కె) చెరువుకట్ట దిగువ భాగంలో బీటీ రోడ్డుకు అతి సమీపంలో అతి పెద్ద గోతి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. గత వర్షాకాలంలో ఏర్పడిన భారీ గుంతను పూడ్చివేయాల్సిన ఆర్ అండ్ బీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది క్రితమే రూ.కోటీ 20 లక్షలతో మానిక్‌బండార్ నుంచి బోర్గాం (కె) వరకు మరమ్మతుల పనులు చేపట్టినప్పటికీ.. గుంతను పూడ్చకుండానే వదిలేశారు. రోడ్డు పక్కనే ఉన్న భారీ గుంతలను పూడ్చకుండా పనులను ఎలా చేయిస్తారని ఆర్‌అండ్‌బీ ఏఈ గులాబ్‌సింగ్‌ను నిలదీసినప్పటికీ పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. స్కూల్ బస్సులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి రాకపోకలతో పాటు ఆటోలతో రద్దీగా ఉండే బీటీ రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను వెంటనే పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



మా ఊరు చెరుకట్ట కింద డాంబర్ రోడ్డు పక్కనే పెద్ద గుంత ఏర్పడింది. అక్కడ వాహనదారులు ఏ కొద్దిగా అజాగ్రతగా ఉన్న పెద్ద ప్రమాదం జరగడంతోపాటు ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. ప్రమాదాలు జరుగక ముందే సంబంధిత అధికారులు వెంటనే మొరంతో గుంతను పూడ్చివేయించాలి.

– రాంపూర్ రాములు, బోర్గాం(కె)

దరఖాస్తు ఇస్తే ప్రతిపాదనలు పంపిస్తా

బోర్గాం (కె) చెరువుకట్ట కింది భాగంలో బీటీ రోడ్డు పక్కనే గుంత ఉన్న విషయం తెలుసు. రేడియం రిబ్బన్లతో ప్రమాదసూచికలను ఏర్పాటు చేయించాం. గ్రామస్తులు దరఖాస్తు ఇస్తే కొత్తగా ప్రతిపాదనలు పంపి గుంతను పూడ్చివేయించేందుకు మట్టి పోయిస్తాం.

– గులాబ్‌సింగ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మాక్లూర్

రాష్ట్రస్థాయికి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



క్రీడాకారుడు భార్గవ్‌ను అభినందిస్తున్న టీచర్లు

పెర్కిట్(ఆర్మూర్): తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి గటాడి రాజేశ్ గురువారం రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల టోర్నమెంట్‌కు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆసిఫాబాద్‌లో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, హాకీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, పీఈటీలు సునీత, మాధురి, రజిత, సురేశ్, శ్రీనివాస్, అనూష, రాహుల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారుడికి అభినందన

మాక్లూర్: ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించిన గుత్ప ప్రభుత్వ పాఠశాల విద్యార్థి డి భార్గవ్‌ను ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. పీఈటీ సునీల్, ఎంపీపీ మాస్త ప్రభాకర్, సర్పంచ్ గంట చిన్నయ్య, ఉపసర్పంచ్ రాంఘవేందర్‌రావు, పాఠశాల చైర్మన్ రమేశ్, ఉపాధ్యాయులు దామెర సునీల్, గిరిరాజ్, నరేందర్‌రావు, ఆంజనేయగౌడ్, శ్రీనివాస్, విష్ణుమూర్తి, నరేశ్, ప్రవీణ్‌కుమార్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యదర్శి నిలదీత



వర్ని: వర్ని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరగడం, రాత్రివేళల్లో బీరువా, కార్యాలయం తాళం తీసి ఉండడంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి కార్యదర్శి శ్రీనివాస్‌ను నిలదీశారు. గుర్తుతెలియని వ్యక్తులు, పాత పాలకమండలి సభ్యులు కొందరు వర్ని మార్కెట్ కమిటీ ఆవరణలో తరచూ తిరుగుతున్నారని, రాత్రి వేళల్లో కార్యాలయం తీసి ఉంచడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా తాను కార్యాలయా నికి రావడంలేదని చెక్‌పోస్ట్ వద్దే ఉంటున్నానని కార్యదర్శి సమాధానం ఇవ్వడం, రెండు నెలలుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేని విషయం కూడా కార్యదర్శికి తెలియకపోవడంపై మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాయకులు హెచ్చరించారు.

ఆహ్వానపత్రిక అందజేత



నందిపేట్(ఆర్మూర్): అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావాలని మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములుమహరాజ్‌కు ఆహ్వానం అందింది. విశ్వహిందూ పరిషత్ శాఖ వారికి కొరియర్‌ల వచ్చిన ఆహ్వానపత్రికను నాయకులు గురువారం మహరాజ్‌కు అందజేశారు. మహరాజ్ అయోధ్యకు వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కేదారేశ్వర ఆశ్రమ కమిటీ తెలిపింది. శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానం అందడం తన పూర్వజన్మ సుకృతమని మహరాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అయోధ్య తీర్థ ట్రస్ట్ సభ్యులు గాజుల దయానంద్, సంజీవ్ మహరాజ్, బోచ్కర్ నిఖిల్, బొడ్డు రాజేంద్రప్రసాద్, పాండురంగరావు, డొంకేశ్వర్ యోగేశ్, మణిదీప్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



గురుకుల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: గురుకులాల్లో ఉంటూ చదువుకొనే విద్యార్థులకు వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యనందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలిచ్చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

ఇసుక డంపుల వేలం

రుద్రూర్/రెంజల్: మంజీర నది, నీలా పెద్దవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు పొతంగల్, రెంజల్ తహసీల్ కార్యాలయాల ఆవరణలో గురువారం వేలం నిర్వహించారు. పొతంగల్‌లో రాజు అనే వ్యక్తి 15 ట్రాక్టర్ల ఇసుకను రూ.33,500కు, రెంజల్‌లో నిర్వహించిన వేలంలో నవీపేట్ మండలం కోస్లీకి చెందిన వ్యక్తి నాలుగు ట్రాక్టర్ల ఇసుకను రూ.10,500కు దక్కించుకున్నారు. తహసీల్దార్లు రమేశ్, రాంచందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

రుద్రూర్/మాక్లూర్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పొతంగల్ మండలం కొడిచర్ల, కల్లూర్, మాక్లూర్ మండలం చిన్నాపూర్, అడవి మామిడిపల్లి గ్రామాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. వికసిత్ భారత్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మాక్లూర్ ఎంపీడీవో జె క్రాంతి, పంచాయతీ అధికారులు మారుతి, శ్రీనివాస్, పొతంగల్ ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో గంగారాం, మాక్లూర్ వ్యవసాయ అధికారిణి పద్మ, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో – బేటీ పడావోపై శిక్షణ

నవీపేట : ఆడబిడ్డల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంపై మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో గురువారం శిక్షణ ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత, మహిళా సాధికారత జిల్లా కో ఆర్డినేటర్ స్వప్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లకు, ఐకేపీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి పలు సూచనలు చేశారు. పథకంపై మారుమూల గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆడబిడ్డల సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ రాంబాబు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..

మాక్లూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీప్రియ, సునీత మాట్లాడుతూ.. ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. వరలక్ష్మి, స్వర్ణలత, ఏపీఎం అనిల్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నందిపేట్ (ఆర్మూర్): వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులకు గురువారం వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా నగదు రూ.1250, రెండో బహుమతిగా రూ.750 అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. వాలీబాల్‌లో మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతి రూ.2500 వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మన్సూర్ భూమేశ్, దేవన్న, రమేశ్, రామకష్ణ సేవా సమితి సభ్యులు సునీల్, శ్రీనివాస్‌రాజు ధర్మపురి నాగేశ్వరావు పురుషోత్తం, ప్రభాకర్, రంజిత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థినులు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోనే తొలిసారిగా డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను స్వయంగా తయారు చేసి పాఠశాల ఆవరణలో విక్రయించి ఆదాయాన్ని పొందారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సోన్ పాపడ్, ఫ్రూట్ సలాడ్, నువ్వుల లడ్డు, బ్రెడ్ ఆమ్లెట్, చికెన్ ఫ్రై, గులాబ్ జామూన్ మొత్తం యాభై రకాల వెరైటీ ఆహార పదార్థాలను తయారు చేశారు. మొదటిసారిగా విద్యార్థులు సొంతగా పెట్టుబడి పెట్టి తయారు చేసిన వంటకాలను విక్రయించి రెట్టింపు ఆదాయాన్ని పొందడంపై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూసేందుకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపారు. హెచ్‌ఎం సురేశ్‌కుమార్, సర్పంచ్ చాయచందు, పాఠశాల బృందం గంగారెడ్డి, అశోక్, రమణాచారి, రాజేశ్వర్, సాయికుమార్, సాయిలు, మహేశ్, రవి, సాగర్, చీమయ్య పాల్గొన్నారు.

జొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాల్కొండ: జొన్న పంటలో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌లో గురువారం జొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి వివరించారు. జొన్న పంటలో పేను బంక నివారణకు డైమిథయేట్ 400 ఎంఎల్ లేదా తయోమితాక్‌సెమ్ 80 గ్రాములు లేదా ఎసిఫేట్ 300 గ్రాములు ఒకదానిని 200 లీటర్ల నీటినిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. బంక కారు తెగులు నివారణ కోసం కార్బెండిజం 200 గ్రాములు లేదా మాంకోజెబ్ 250 గ్రాములు ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆయనవెంట ఉప సర్పంచ్ లింబారెడ్డి, రైతులు ఉన్నారు.

సాయిలు సేవలు మరువలేం

బోధన్/రెంజల్/నందిపేట్ : ప్రజా ఉద్యమాలకు కామ్రేడ్ సావులం సాయిలు ఊపిరిపోశారని, ఆయన సేవలు మరువలేమని నాయకులు కొనియాడారు. బోధన్, రెంజల్ మండలం బోర్గాంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో, నందిపేట్ మండలం వెల్మల్‌లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సాయిలు వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోధన్‌లో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, సీతారాం, గంగయ్య, బాలయ్య, పోశెట్టి, రాజు, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు. బోర్గాంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకుడు నరేందర్, బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, ఒడ్డెన్న, పుట్టి నాగన్న, నసీర్, రాజేశ్వర్, పెద్దులు, గోపాల్, సంతోష్, మైసయ్య, వెల్మల్‌లో నాయకులు గంగాధర్, రాజలింగం, దేవన్న, వంజరి గంగాధర్, వెంకటి పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబురం



జానకంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోగి మంటలు

సాక్షి నెట్‌వర్క్ : పాఠశాలలు సంక్రాంతి సంబురాలతో కళకళలాడాయి. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, పంతుగల పోటీలు నిర్వహించారు. చిన్నారులకు ఉపాధ్యాయులు భోగిపండ్లు పోశారు. భోగి మంటలు వేసి సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో పల్లెవాతావరణం ఉట్టిపడింది. సంక్రాంతి సెలవులకు హాస్టళ్ల నుంచి విద్యార్థులకు ఇళ్లకు వెళ్లారు.



ఆర్మూర్‌లోని లోటస్ పాఠశాలలో..



బోధన్‌లోని ఆచార్య పాఠశాలలో..



సాలూరలోని వాగ్దేవి పాఠశాలలో..

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – హనుమాన్(తెలుగు)- 09.05, 12.25, 6.50, 10.10

స్క్రీన్-2 – గుంటూరు కారం (తెలుగు)- 08.00, 11.20, 6.15, 9.35
సలార్ (తెలుగు) - 2.40

స్క్రీన్-3 – గుంటూరు కారం (తెలుగు)- 08.30, 11.50, 3.10, 6.30, 9.50

స్క్రీన్-4 – గుంటూరు కారం (తెలుగు)- 9.00, 12.30, 3.40, 7.00, 10.20

గృహలక్ష్మి లబ్ధిదారుల ధర్నా సిగ్గుచేటు



బాల్కొండలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గౌడ్



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న బొదిరె స్వామి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న నాయకులు



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న నాయకులు

బాల్కొండ/వేల్పూర్/కమ్మర్‌పల్లి/భీమ్‌గల్: ఎన్నికలకు ముందు హడావుడిగా గృహలక్ష్మి పేరుతో దొంగ ప్రొసిడింగ్ కాపీలు ఇప్పించిన వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇప్పుడు మాయమాటలు చెప్పి అమాయక ప్రజలను రోడ్లపైకి తీసుకువచ్చి ధర్నాలు చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు గున్నాల వెంకటేశ్‌గౌడ్, గడ్డం నర్సారెడ్డి, సుంకెట రవి, బొదిరె స్వామి తదితరులు నాయకులతో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా పాలనను చూసి బీఆర్‌ఎస్ నాయకులు భయపడుతున్నారని వారు అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గృహనిర్మాణశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఏ ఒక్క కుటుంబమైనా పక్కా ఇంటిని నిర్మించుకున్నదా అని ప్రశ్నించారు. ఏకంగా గృహనిర్మాణశాఖను రద్దుచేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులు కాలయాపన చేసి, ఇప్పుడు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఇళ్లులేని అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వెల్లడించారు.